సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 37 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 20.05.2025



# హస్తవ్యస్తం

## కాంగ్రెస్‌లో గ్రూప్ ఫైట్

- రసాభాసగా మారిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- నాగపురి కిరణ్‌కుమార్‌పై హైకమాండ్‌కు ఫిర్యాదు
- పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు మరో మారు భగ్గుమన్నాయి. సొంత పార్టీ నాయకులే ఒకరిపై ఒకరు బాహాబాహీకి దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

### అసలేం జరిగింది..

జనగామ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నేత నాగపురి రాజలింగం కుమారుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ తన వర్గీయులతో సీఎంఆర్ఎఫ్ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రూ.10 లక్షల విలువైన 24 చెక్కులను బాధితులకు అందజేసేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. పార్టీ ప్రొటోకాల్ పాటించకుండా చెక్కులు పంపిణీ చేసే అధికారం కిరణ్ కుమార్‌రెడ్డి ఎక్కడి అంటూ గొడవకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న జనగామ సీఐ దామోదర్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పి శాంతిపజేశారు. పోలీసుల సూచనతో అక్కడి నుంచి వెళ్లిపోయిన కిరణ్‌కుమార్ గౌడ్ మరో సారి తన మద్దతుదారులతో సిద్దిపేట రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో చెక్కుల అందజేసేందుకు ప్రత్నించాడు. దీంతో మళ్లీ కొమ్మూరి వర్గీయులు ఆయనను అడ్డుకోవంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో జనగామ ఏఎస్పీ పండరి చేతన్ ఘటన స్థలానికి చేరుకుని కార్యక్రమాన్ని నిలిపివేయించి ఇరువర్గాలను బయటకు పంపారు.



### అప్పుడు పొన్నాల.. ఇప్పుడు నాగపురి..

కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు, గ్రూప్ తగాదాలు కొత్తేమి కాదు. గతంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ప్రస్తుత డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య తీవ్ర వర్గపోరు కొనసాగింది. 2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పొన్నాల కాంగ్రెస్ పార్టీని వీడిపోవడం.. ఆయన వెంటే ఆయన వర్గీయులు కొందరు వెళ్లిపోవడంతో పార్టీలో కొమ్మూరిదే పైచేయిగా నిలించింది. అయితే ఆ సమయంలో బీఆర్ఎస్ పార్టీలో నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీకి వచ్చారు. అలా వచ్చిన ఆయన కాంగ్రెస్ పార్టీలో తనకు ఉన్న పాత పరిచయాలతో మెల్లమెల్లగా పావులు కదుపుతూ జిల్లా కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పార్టీలో మరో సారి గ్రూపు రాజకీయాలు తెరపైకి వచ్చాయి.



'పార్టీ ప్రోటోకాల్ తప్పితే

## చర్యలు తప్పవు'

2



సర్వే, మార్కింగ్ ప్రక్రియ

## స్పీడప్ చేయాలి

3

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా




సుందరయ్య జీవితం

## అందరికీ ఆదర్శం

2

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



భాగస్వామ్యం పేరుతో

## ఘరానా మోసం

2

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

General News




# ప్రోటోకాల్ తప్పితే చర్యలు తప్పవు

- **నాగపురి కిరణ్‌ను సస్పెండ్ చేయాలి**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలో కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలకు తావులేదని, పార్టీలో ఎవరైనా ప్రోటోకాల్ తప్పితే చర్యలు తప్పవని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో జనగామ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు గౌడ్, చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాంజ మల్లేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనగామ నియోజకవర్గంలో కొందరు కావాలని ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోసం పనిచేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పార్టీలో చేరారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి తొత్తులుగా ఉంటూ జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. జనగామ నియోజకవర్గం చేర్యాల ప్రాంతానికి చెందిన నాగపురి కిరణ్ 2014 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి, 2014 తరవాత టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పార్టీ మారి, గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో బిఆర్ఎస్ లో ఉండి కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసిన వ్యక్తి అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ పార్టీకి వచ్చి ఇప్పుడు కావాలని జనగామలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న వారి వద్దకు వెళ్లి డబ్బులు (కమిషన్) తీసుకొని ఏదో ఒక మంత్రితో పైరవీ చేసి సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధితులకు సమయానికి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, తానే సొంతంగా చెక్కులు తెప్పించినట్టు వ్యవహరిస్తూ తనకు ఎలాంటి అధికారం లేకున్న జనగామలో ప్రోటోకాల్ కు విరుద్ధంగా నాయకులకు సమాచారం ఇవ్వకుండా ప్రోగ్రామ్స్ పెట్టి పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ పరువు తీస్తున్నాడని అన్నారు. నాగపురి కిరణ్ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు పిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆయనను పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేసే వరకు ఊరుకోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గంగం నరసింహారెడ్డి, జిల్లా నాయకులు ఆలేటి సిద్ధిరాములు, బక్క శ్రీనివాస్, నర్మెట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజబోయిన లక్ష్మీనారాయణ, తరిగొప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వగలబోయిన యాదగిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల సాయిలు, ఏఎంసీ డైరెక్టర్ బన్సీ నాయక్, మండల ప్రధాన గజే అనిల్, తుపాకుల రాములు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ కృష్ణన్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆసిఫ్, జనగామ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్, గుర్రం బాలరాజ్, విద్యానాథ్, బాల్ సింగ్, వెంకట్, బనుక ప్రభాకర్, నికిల్, రాకేష్, సురేష్, శ్రీధర్, శంకర్, మురళీ, పవన్ రాజ్, బక్క ప్రవర్ధన్, ధర్మేందర్, రాజ్, అరవింద్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

# భాగస్వామ్యం పేరుతో ఘరానా మోసం

- **దివ్యాంగుడి వద్ద డబ్బులు కట్టించుకుని గెంటేసిన వైనం**
- **పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని ఆవేదన**
- **గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకున్న బాధితుడు**



**జనగామ, మన చౌరాస్తా :** భాగస్వామ్యం పేరుతో ఓ వ్యాపారి దివ్యాంగుడికి కుచ్చు టోపీ పెట్టాడు. అవసరానికి భాగస్వామ్య డబ్బులు కట్టించుకుని టెండర్ సాధించుకున్నాక షాపు నుంచి దివ్యాంగుడిని గెంటేసి కర్కశత్వాన్ని చాటుకున్నాడు. సదరు బాధితుడు పోలీసులను సంప్రదించినా ఫలితం లేదని వాపోతున్నాడు. దీంతో చివరికి కలెక్టర్కు వినతిపత్రం సమర్పించి తన గోడును వెల్లబోసుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన దివ్యాంగుడు నామాల రాజు, జనగామ పట్టణానికి చెందిన గుగులోత్ వెంకన్న కలిసి జనగామ బస్టాండ్లోని మూడో నంబర్ స్టాల్లో జగదాంబ పాప్కార్న్ షాపునకు టెండర్ వేశారు. టెండర్ గుగులోత్ వెంకన్న పేరుపై వచ్చింది. కానీ టెండర్కు సంబంధించిన డబ్బులు మాత్రం ఇద్దరు భరించారు. షాపును భాగస్వామ్య పద్ధతిలో తీసుకుంటున్నట్లు పెద్దల సమక్షంలో ఇద్దరు కలిసి ఒప్పంద పత్రం కూడా రాసుకున్నారు. ఈ అంగీకార పత్రం ప్రకారం ఏడాది పాటు భాగస్వామ్య పద్ధతిలో షాపు నిర్వహించాల్సి ఉంటుంది. షాపు నిర్వహణ కోసం నామాల రాజు ఇప్పటివరకు సుమారు రూ.7 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. మొదటి రెండు నెలల పాటు షాపును ఇద్దరు కలిసి నడిపారు. మూడో నెలకు వచ్చేసరికి గుగులోత్ వెంకన్న భాగస్వామ్య ఒప్పందాన్ని ఉల్లంఘించాడు. ఈ షాపుతో నీకే సంబంధం లేదంటూ రాజును వెళ్లగొట్టాడు. ఈ విషయమై రాజు జనగామ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారేమీ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నాడు. పైగా ఏకంగా పోలీసులే తనను షాపు నుంచి బలవంతంగా గెంటేశారని వాపోయాడు. మరోసారి షాపు వద్దకు వెళ్తే తనపైనే ఎస్టీ అట్రాసిటీ కేసు పెడుతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు జరిగిన మోసంపై న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నామాల రాజు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్కు ఫిర్యాదు చేశారు. భాగస్వామ్య ఒప్పందాన్ని ఉల్లఘించడంతో తాను లక్షల్లో నష్టపోవడంతో పాటు తన కుటుంబం రోడ్డున పడిందని గోడు వినిపించాడు. పోలీసులు మోసగించిన వ్యక్తికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించాడు. ఈ విషయంలో చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని కలెక్టర్ను కోరాడు.




# సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం

**సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం దేశంలో అన్ని వర్గాల వారికి ఆదర్శమని, కమ్యూనిస్టుగా నిరాడంబర జీవితాన్ని గడిపిన మహోన్నతుడు సుందరయ్య సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం జనగామ పట్టణ కార్యాలయంలో సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కనకారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుందరయ్య జీవితం ఒక కమ్యూనిస్టులకే కాకుండా అన్ని రంగాల ప్రజలకు ఆదర్శమని ఆయన సమాజంలోని కుల వివక్షత అంటరానితనం చూసి చలించిపోయారన్నారు. అసమానతలను లేని అంతరాలు లేని సమాజం కోసం ఆయన విశేష కృషి చేశారన్నారు. ఆయన జీవితం అనేక త్యాగాలతో నిర్మితమైందని, పిల్లలు పుడితే ఉద్యమానికి దేశానికి సేవ చేయలేనని పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారన్నారు. సుందర వెంకటరామిరెడ్డి పేరును సుందరయ్యగా మార్చుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లేవారని, నేటి తరానికి ఆయన జీవితం ఎంతో ఆదర్శమని వారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరుగుతున్న సమయంలో సుందరయ్య నిర్వహించిన పాత్ర చరిత్ర పుట్టల్లో నిలిచిపోతుందన్నారు. వారి స్ఫూర్తితో సీపీఎం శ్రేణులు పోరాటపటిమను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, నాయకులు సిద్ధిరాల ఉపేందర్, అజ్మీరా సురేష్ నాయక్, మల్లేష్ రాజ్, మాదాసి సుధాకర్, ముష్పట్ల జయ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నరేష్ కుమార్‌కు దళిత రత్న అవార్డు



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు దత్రపు నరేష్ కుమార్‌కు దళిత రత్న అవార్డు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఇచ్చే దళిత రత్న అవార్డును ఈ సంవత్సరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ ల జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర చైర్మన్ ఇటుక రాజు మాదిగ, కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురాం, మాదిగ మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలడుగు మేరీ మాదిగ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా దళిత సమస్యలపై అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకువెళ్లే విధంగా పనిచేస్తున్న అత్యుత్తమ వ్యక్తులను గుర్తించి ఈ అవార్డు అందజేస్తారు. ఈ సందర్భంగా దళిత రత్న అవార్డు గ్రహీత నరేష్ కుమార్ మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంలో పని చేస్తూ దళిత సమస్యలపై గత రెండు దశాబ్దాలకు పైగా పోరాడుతున్న తనను గుర్తించి అవార్డు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

Local News



# సర్వే, మార్కింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

■ **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ దరఖాస్తుల సర్వే, మార్కింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 90 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పూర్తయిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, మిగిలిన పెండింగ్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే పరిశీలన చేసిన దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు చేయాలని, పైలట్ మండలాల కింద 12 గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ మార్కింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బేస్మెంట్ పూర్తైన వాటికి నగదు చెల్లింపుల్లో కూడా రాష్ట్ర స్థాయిలో జిల్లా ఉన్నత స్థానంలో ఉందన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల కింద ఉప కులాల వారీగా అర్హులను ఎంపిక చేసేందుకు క్షుణ్ణంగా దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతోందని, ఇంకా 20 శాతం ధాన్యం కొనుగోలు మిగిలి ఉందని, అందుకు సంబంధించి కొనుగోళ్లు మొత్తం పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సన్న బియ్యం పంపిణీ కేంద్రాలను తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు సందర్శించి, పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సరఫరాలో వేసవి కార్యాచరణ ప్రణాళికను సక్రమంగా అమలు చేయాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, ఎక్కడా కూడా మంచి నీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఎరువుల దుకాణాలను తహసీల్దార్లు, ఏఈఓలు, ఎంఏఓలు, మండల ప్రత్యేక అధికారులు సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, జిల్లాకు సరిపడా విత్తనాలు వచ్చాయని, విత్తనాల కొరత రాకుండా, నాణ్యమైన విత్తనాల క్రయవిక్రయాలు జరిగేలా చూడాలని, ప్రతి దుకాణంలో ధరల పట్టిక బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.సమీక్ష సమావేశంలో జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్టేషన్‌ఘన్‌పూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీసీఎస్ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జనగామ, మన చౌరాస్తా : ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 69 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకుని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్



డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డిప్యూటీ జెడ్పీ సీఈవో సరిత, డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీసీఎస్ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన సమస్యలను పరిష్కరించాలి

**సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్**


**జనగామ, మన చౌరాస్తా :** గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ మహేందర్ నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ తాండ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రమాణాలు మెరుగుపరుచుటకు తండా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని, సంవత్సరానికి కోటి రూపాయలు ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించాలని కోరారు. గిరిజన రైతులకు రైతు భరోసా ఎకరాకు రూ.10 వేలు చొప్పున సంవత్సరానికి రెండు సార్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధారావత్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేష్, జిల్లా యువజన అధ్యక్షులు తేజావత్ మోహన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ధరావత్ ప్రకాష్, నర్మెట్ట మండల అధ్యక్షుడు బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగపురి, నూకలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**జనగామ, మన చౌరాస్తా :** సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కోసం తనను డబ్బులు అడిగారని బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన సాగర్ అనే యువకుడు కాంగ్రెస్ నేతలు నాగపురి కిరణ్‌కుమార్, నూకల బాల్‌రెడ్డిపై పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తమ బంధువులకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు విషయంలో గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవడం జరిగిందని, దానికి సంబంధించిన మెసేజ్ కూడా వచ్చిందని తెలిపారు. అదే క్రమంలో బాల్‌రెడ్డి గతంలో మీకు చెక్ ఇప్పిస్తాను కానీ కొంచెం ఖర్చు అవుతుంది అని చెప్పాడని వాపోయాడు. సోమవారం చెక్కు ఇస్తామని పిలిచి కావాలంటే ఖర్చు అవుతుందని అన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## యువకుడి మృతి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** మద్యానికి బానిసై యువకుడు మృతి చెందిన ఘటన బచ్చన్నపేట మండలంలో జరిగింది. బోనకొల్లురు గ్రామానికి చెందిన బైరు మహేష్ ( 33 ) సంవత్సరాలు కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. పనికి వెళ్లకుండా మద్యానికి బానిసై డబ్బులు ఖర్చు చేసేవాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు పనికి వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం కొడవటూర్ చింతల కుంట కట్ట వద్ద మహేష్ శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు డిహైడ్రేట్ గురై మృతి చెందినట్లుగా తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు బచ్చన్నపేట ఎస్సై ఎస్.కె హమీద్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు.





# కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది

## నటుడు జూనియర్ ఎన్టీఆర్ మనోగతం

జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వాత దేవర-2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే ట్రిబుల్ ఆర్ కాన్సర్ట్ లో పాల్గొని వచ్చాడు. ఇప్పుడు కర్ణాటకలో డ్రాగన్ షూటింగ్ లో పాల్గొంటు-న్నాడు.